సీతగుంటలో స్వచ్ఛభారత్

ప్రజాశక్తి- పెదబయలు: సీతగుంటలో స్థానిక ఎస్ఐ రమణ ఆద్వర్యంలో సిఆర్‌పిఎఫ్ ప్రత్యేక బెటాలియన్ బుధవారం చెత్తాచెదారం తొలగించారు. దీంతో, సిఆర్‌పిఎఫ్ పోలీసులను స్థానికులు అభినందించారు.

శుభ్రం చేస్తున్న సిఆర్‌పిఎఫ్ పోలీసులు

రాత్రి వేళలో పర్యాటకులతో రద్దీగా పర్యాటక ప్రాంతం

అరకులోయలో పోటెత్తిన పర్యాటకులు

-కిటకిట లాడిన సందర్శిత ప్రాంతాలు- స్తంభించిన ట్రాఫిక్- అవస్థలు పడ్డ పర్యాటకులు

ప్రజాశక్తి- అరకులోయ: పర్యాటక కేంద్రమైన అరకులోయలో బుధవారం పర్యాటకులు పోటెత్తారు. దసరా సెలవులు కావడంతో పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో, అరకులోయ ప్రాంతంలోని సందర్శిత ప్రాంతాలైన గిరిజన సంస్కృతిక మ్యూజియం, పద్మావతి ఉద్యానవన కేంద్రం, కాఫీ మ్యూజియం వంటి సందర్శిత ప్రాంతాలు కిటకిటలాడాయి. అధిక సంఖ్యలో తరలి రావడంతో అరకులోయ టౌన్ షిప్‌లో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్ జాం ఏర్పడింది. ఈ మధ్యకాలంలో ఎక్కువ మొత్తంలో పర్యాటకులు తరలి రావడం ఇదే తొలిసారి. పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆయా సందర్శిత ప్రాంతాల్లో ప్రవేశ టికెట్ రూపంలో ఆదాయం సమకూరింది.

అనంతగిరి రూరల్: అరకు ఘాట్ రోడ్డులో పర్యాటకులకు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. ట్రాఫిక్ పద్మ వ్యూహంలో చిక్కుకొని గంటల తరబడి పర్యాటకులు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. బుధవారం అరకు లోయ సందర్శనకు వచ్చిన పర్యాటకుల తాకిడితో ఘాట్ రోడ్డులో చిలకలగడ్డ, టైడా, డముకు, అనంతగిరి కాఫీ తోట సమీపంలో వాహనాలు అధిక సంఖ్యలో బారులు తీరి ఉండిపోయాయి. కొంతమంది పర్యాటకులు ట్రాఫిక్‌లో చిక్కుకొని బొర్రా గుహల సందర్శిత ప్రాంతాలు కూడా పర్యటించని పరిస్థితి నెలకొంది. పర్యాటకుల సీజన్ కావడంతో అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యను నియంత్రించడానికి ప్రత్యేకంగా చర్యలు చేపట్టి పర్యాటకుల కష్టాలను తీర్చాలని వాహన చోదకుల కోరుతున్నారు.

ఘాట్ రోడ్డులో నిలిచిన వాహనాలు

జిల్లా కేంద్రాన్ని తరలిస్తే ఊరుకోం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: అల్లూరి జిల్లా కేంద్రాన్ని నర్సీటపన్నం కేంద్రంగా తరలించేందుకు ప్రభుత్వం పూనుకుంటే ఊరుకునేది లేదని మాజీ ఎమ్మెల్యే ఫాల్గుణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. అల్లూరి జిల్లా కేంద్రాన్ని మైదాన ప్రాంతంలోని నర్సీపట్నంలో తరలించే ప్రయత్నాల ఊహగానాలు అధికమయ్యాయని చెప్పారు. స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా పాడేరులో ఐటీడీఏ ఉన్నప్పటికి గిరిజనులు అభివృద్ధికి దూరంగా ఉన్నారని చెప్పారు. కనీస సౌకర్యాలతోపాటు అభివృద్ధికి నోచుకోలేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సామాజిక మాధ్యమాల్లో వస్తున్న పుకార్లు నిజం కాకుండా చూడాలని ఆయన ప్రభుత్వానికి కోరారు.

అస్తవ్యస్తంగా రహదారులు

-అవస్థలు పడుతున్న గిరిజనులు

ప్రజాసాక్ -హుకుంపేట: మండలంలోని గత్తుం పంచాయతీలో పలు గ్రామాలకు రహదారి పనులు నిలిచి పోవడంతో గిరిజనులు అవస్థలు పడుతున్నారు. గత్తుం నుండి జంగంపుట్టు, దుర్గం డాలింపుట్టు, వెలగపాడు మీదుగా కరకవలస వరకు ఐదున్నర కిలోమీటర్లు రోడ్డు నిర్మాణానికి సుమారు కోటి 80 లక్షల నిధులు 2022 సంవత్సరంలో మంజూరు అయ్యాయి. రెండు సంవత్సరాలు అవుతున్నా అరకొర పనులు చేపట్టి వదిలేయడంతో వర్షాలకు, తుఫాన్లకు రోడ్లు కోతకు గురవుతున్నాయి. దీంతో, రాకపోకలకు గిరిజనులు అవస్థలు పడుతున్నారు. నిత్యావసరాలకు తెచ్చుకునేందుకు వీలు లేక పలు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు సౌకర్యం కల్పించాలని పలుమార్లు 6 గ్రామాల ప్రజలతో గిరిజన సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో ఎన్నో ఉద్యమాలు పోరాటాలు చేస్తే ఎట్టకేలకు రహదారి మంజూరు అయ్యింది. ఆ సంతోషం అంతలోనే ఆవిరిగా మారింది. పూర్తిస్థాయిలో రోడ్డు పనులు చేపట్ట లేదు. దీంతో, గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు.

అస్తవ్యస్తంగా ఉన్న డాలింపుట్టు రోడ్డు

బీటలు బారిన జంగంపుట్టు రోడ్డు

రోడ్డు పనులు పూర్తి చేయాలి

భారీ వర్షాలు, తుఫాను కారణంగా రోడ్లన్నీ కోతకు గురవుతున్నాయి. బీటలుగా మారి కాలి నడకన వెళ్లేందుకు కూడా వీలులేని పరిస్థితి ఏర్పడింది. దీంతో, నిత్యావసర సరుకులు తెచ్చుకునేందుకు, ఆసుపత్రికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు గుర్తించి పూర్తిస్థాయిలో రహదారి పనులు చేపట్టాలి.

లింగన్న, గ్రామ పెద్ద

'క్వారీలను గిరిజన యువతకు కేటాయించాలి'

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: ఏజెన్సీ పరిధి మండలాల్లో క్వారీలను గిరిజన యువతకు కేటాయించి అభివృద్ధికి పాటుపడాలని టిడిపి మండల అధ్యక్షులు టీ.సుబ్బారావు చెప్పారు. గ్రామాల్లో పనుల కోసం తలపెట్టిన పల్లె పండుగను ప్రభుత్వం ఈనెల 14 నుంచి 20వరకు నిర్వహించనున్న కార్యక్రమంలో 100రోజుల్లో అభివృద్ధి పనులు జరిగేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించడం అభినందనీయమన్నారు. జిల్లా పరిధిలోని మండలాల్లో క్వారీలు లేవని, అభివృద్ధి పనులకు నిర్మాణ సామాగ్రిలు సమకూర్చుకోవడానికి మైదాన ప్రాంతం నుంచి ఎగుమతి చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన పనులు మన్యంలో జరగకగా అసంపూర్తిగా నిలిచి పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. జాతీయ రహదారి నిర్మాణానికి క్వారీలను కేటాయించడంతో త్వరితగతిన పనులు పూర్తయ్యాయన్నారు.

న్యాయం జరిగే వరకు పోరాటం

గ్రామ వాలంటీర్ల సదస్సు తీర్మానం

ప్రజాశక్తి-రంపచోడవరం

గ్రామ/ వార్డు వాలంటీర్లకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని బుధవారం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన గ్రామ వాలంటీర్ల మండలం సదస్సు ఏకగ్రీవంగా తీర్మానించింది. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.శాంతిరాజు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ముఖ్య అతిథులుగా పాల్గొన్న సీఐటీయూ ఎస్ఆర్ రంపచోడవరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మట్ల వాణిశ్రీ, పల్లపు వెంకట్ మాట్లాడుతూ రాష్ట్రంలోని టిడిపి కూటమి ఎన్నికల్లో గ్రామ వాలంటీర్లకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయడంలో విఫలమైందని పేర్కొన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కావస్తున్నా గ్రామ వాలంటీర్ల ఊసే ఎత్తడం లేదన్నారు. వంద రోజుల పాలన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం పేర ఇంటింటికి స్టిక్కర్ల అంటించటం గొప్పలు చెప్పుకోవడం తప్పా, ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్, గ్రామ వాలంటీర్లు, కార్మికులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదని పేర్కొన్నారు. తిరుపతి లడ్డూపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేస్తున్నారని, ఇచ్చిన సూపర్ సిక్స్, ఇతర హామీలు అమలు చెయ్యనందుకు ఆయన ప్రాయశ్చిత్త దీక్షలు చేయాలని మంచిదని హితవుపలికారు. గ్రామ వాలంటీర్లపై టిడిపి కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి స్పష్టమైన నిర్ణయం చెయ్యకపోవడంతో వారి పరిస్థితి అయోమయంలో గాల్లో దీపంలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే నిలబెట్టుకోవాలని, వాలంటీర్లను విధుల్లోకి తీసుకొని ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్నికల హామీ మేరకు రూ.10వేలు వేతనం ఇవ్వాలని, వైసిపి నాయకులు బలవంతంగా రాజీనామాలు చేయించిన గ్రామ వాలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామవాలంటీర్లపై కూటమి ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకునేంతవరకు ఈ పోరాటం ఆగదని సదస్సు తీర్మానం ద్వారా హెచ్చరిక చేశారు.

సదస్సులో పాల్గొన్న సిఐటియు నాయకులు వెంకట్, వాణిశ్రీ, వాలంటీర్లు

కార్యవర్గం ఎన్నిక

ఈ సదస్సులో గ్రామ/వార్డు వాలంటీర్ల సంఘం మండల కార్యవర్గం 23 మందితో ఎన్నికైంది. సంఘం మండల అధ్యక్షులుగా చుండం కళావతి, ప్రధాన కార్యదర్శిగా నేసిక వెంకన్న, కోశాధికారిగా చోడి బేబీరత్నం, ఉపాధ్యక్షులుగా సాదాల సోమిరెడ్డి, కంభం కరుణ సుందర్, కారం భాను, సహాయ కార్యదర్శులుగా మడకం పరశురాం, కోసు శ్రీనివాస్, తుంబుడు సుబ్బారెడ్డితో పాటు సభ్యులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో వాలంటీర్లు పాల్గొన్నారు.

వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని మంత్రికి వినతి

చింతూరు : గ్రామ వాలంటీర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు సిఐటియు ఆధ్వర్యాన వాలంటీర్లు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు చింతూరు మండలం నిమ్మలగూడెం గ్రామంలో ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ ట్రస్ట్‌ని సందర్శించడానికి వచ్చిన మంత్రిని సిఐటియు ఆధ్వర్యంలో వాలంటీర్లు బుధవారం కలిశారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న వాలంటీర్లను కొనసాగిస్తామని, త్వరలో జరిగే కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాస్, గిరిజన సంఘం నాయకులు సీసం సురేష్, వాలంటీర్ల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పొడియం జానీ, మండల అధ్యక్షులు బాబురావు, కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

మంత్రి సుభాష్‌కు వినతిపత్రం ఇస్తున్న వాలంటీర్లు

'కొమరం భీమ్' వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి- విఆర్.పురం

మండలంలోని కుంజవారిగూడెం గ్రామంలో కోమరం భీమ్ యూత్ ఆధ్వర్యంలో నాలుగు మండలాల వాలీబాల్ టోర్నమెంట్‌ను ఎంపిపి కారం లక్ష్మి బుధవారం పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడలపై ఆసక్తి కలిగి వుండాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సవలం మారయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, గ్రామ యూత్ కమిటీ ప్రతినిధులు కుంజ చంద్రరావు, కుంజ రమేష్, మాజీ ఎంపీటీసీ అజ్జమ్మ, మాజీ సర్పంచ్ జల్లి తమ్మయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపిపి కారం లక్ష్మి

పసిబిడ్డ మృతిపై సబ్ కలెక్టర్ విచారణ

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ వలసగెడ్డ కాలనీకి చెందిన తమ్మని సమర, పూర్తిమ దంపతుల రెండు నెలల పాప ఈ నెల 6న ఆదివారం మృతి చెందిన సంఘటనపై జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ బుధవారం సాయంత్రం సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అత్యంత గోప్యంగా విచారణ చేపట్టారు. ముందుగా వైద్యాధికారులు డాక్టర్ ఖాదర్ మస్తాన్ వల్లి, డాక్టర్ సౌమ్యలను విడివిడిగా విచారణ చేపట్టి పాప మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. అనంతరం ఆదివారం విధుల్లో ఉన్న స్టాఫ్ నర్సు దేవి, రాజారావు, అంబులెన్స్ డ్రైవర్ జీవన్‌లను విచారించారు. తరువాత బాధితులను విచారించగా, ఆదివారం ఉదయం పాపను సీలేరు పిహెచ్‌సికి తీసుకొస్తే మెరుగైన వైద్యసేవలు నిమిత్తం సకాలంలో రిఫరల్ చేయకపోవడం వల్లే పాప అదే రోజు రాత్రి అంబులెన్స్‌లో చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు వారు చెప్పారు.

తరువాత ఈ సంఘటనపై సబ్ కలెక్టర్ విలేకరులను అడిగారు. ఆదివారం చిన్నారికి మెరుగైన వైద్య సేవ నిమిత్తం సకాలంలో రిఫరల్ చేయకపోవడంతోనే ఆ పాప మృతి చెందినట్లు తమకు ఫిర్యాదు చేయగా ఆసుపత్రికి వచ్చామని, ఆ సమయంలో వైద్యాధికారులు ఎవరూ ఆసుపత్రిలో లేరని విలేకర్లు తెలిపారు. అలాగే పీహెచ్సీ పరిధిలో రోగులు ఎక్కువ శాతం వైద్య సేవలు పొందడానికి సీలేరులో ఆదివారం సంత రోజు వస్తుంటారని, ఆ రోజుల్లో వైద్యాధికారులు విధుల్లో సక్రమంగా ఉండడం లేదని పాత్రికేయులు చెప్పారు.

సర్పంచ్, ఎంపిటిసి, నాయకులతో సమావేశం

స్థానిక ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, సర్పంచి దుర్జుతోనూ, టిడిపి కూటమి నాయకులు చిటికెల రాము, వనముల రాముతోనూ సబ్ కలెక్టర్ వేర్వేరుగా సమావేశమయ్యారు. చిన్నారి మృతిపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. బాధితులు తమకు ఫిర్యాదు చేశారని, ఆస్పత్రికి వచ్చి పరిశీలించగా వైద్యాధికారి విధుల్లో లేరని కూటమి నాయకులు తెలిపారు. ఆసుపత్రిలో డాక్టర్లు తరచూ ఉండడం లేదని, అత్యవసర సమయంలో రోగులకు వైద్య సేవలు అందడం లేదని ఎంపిటిసి, సర్పంచ్ చెప్పారు. అత్యవసర సమయాల్లో వైద్యాధికారులు విధుల్లో సక్రమంగా ఉండడం లేదని గతంలో మూడు పర్యాయాలు పాడేరు ఐటిడిఎ పిఓ అభిషేక్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ దుర్జో తెలిపారు. దీనికి స్పందించిన సబ్ కలెక్టర్ పూర్తి వివరాలతో లేఖ రాసి తన వాట్సాప్ నెంబర్‌కి పంపించాలని సర్పంచ్‌కి సూచించారు. విచారణపై సబ్ కలెక్టరును విలేకరులు ప్రశ్నించగా, ఆయన మాట్లాడేందుకు నిరాకరించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తానని తెలిపారు.

జీకే వీధి మండలం సప్పర్ల, దారకొండ, సీలేరు పీహెచ్సీలో ఈసీజీ, ఎక్స్‌రే, స్కానింగ్, పిల్లలు, గర్భిణులకు స్కానింగ్ పరికరాలు సమకూర్చమని కుటమి నాయకులు, గిరిజన సంఘం నాయకులు సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో కుటమి నాయకులు బాలకృష్ణ, గిరిజన సంఘ నాయకులు మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌ను కలిసిన కూటమి నాయకులు

వికలాంగులకు వీల్ చైర్లు పంపిణీ

ప్రజాశక్తి-రంపచోడవరం

ఆర్ఎస్ స్వేచ్ఛ సొసైటీ 100వ యాక్టివిటీలో భాగంగా సమకూర్చిన వీల్‌చైర్లను బుధవారం రంపచోడవరం పిఎంఆర్‌సిలో సబ్ కలెక్టర్ కల్పశ్రీ చేతుల మీదుగా వికలాంగులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ స్వేచ్ఛ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ కంటా స్వాతి మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజనులకు సేవ చేయడమే తమ లక్ష్యమని చెప్పారు. తమ సొసైటీ స్థాపించి నాలుగు సంవత్సరాలలో 100 సేవా కార్యక్రమాలు పూర్తి చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. రాజమండ్రి ఆర్ఎస్ న్యూరో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ రవీంద్ర ఆధ్వర్యంలో స్థాపించిన తమ సొసైటీ ద్వారా పాడేరు, రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతాలలో మెడికల్ క్యాంపుల నిర్వహణ, గిరిజనులకు సోలార్ లైట్లు, బట్టలు, నిత్యావసర సరుకులు, విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ, స్కూళ్లుకట్టించడం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. అనంతరం సొసైటీలో వాలంటీర్లుగా సహాయం చేసిన వారికి సబ్ కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందజేశారు.

వీల్ చైర్లు అందిస్తున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ, ఆర్ఎస్ స్వేచ్ఛ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ కంటా స్వాతి

మాట్లాడుతున్న సిహెచ్‌డబ్ల్యులు

సిహెచ్‌డబ్ల్యుల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-చింతపల్లి: పండగ రోజుల్లోనైనా తమకు పస్తులు తప్పవా అని కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు (సి హెచ్‌డబ్ల్యులు) ప్రశ్నించారు. ఇప్పటికే బకాయి పడ్డ మూడు మాసాల వేతనాలు చెల్లించకపోవడంతో సుమారు 700 మంది కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సంఘం అల్లూరి జిల్లా అధ్యక్షురాలు పద్మ తెలిపారు. సిహెచ్‌డబ్ల్యుతో కలిసి బుధవారం ఆమె మాట్లాడుతూ, పాడేరు ఐటిడిఏ పరిధిలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు సుమారు 700 మంది ఉన్నారన్నారు. తామంతా క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్నప్పటికీ సకాలంలో వేతనాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. తమకు ఇచ్చే అరకొర వేతనాలు కూడా నెల తరబడి చెల్లించకపోతే ఏమి తిని బతకాలని ఆమె ప్రశ్నించారు. తమ చేత సేవలు చేయించుకుంటున్న ప్రభుత్వం, ఐటిడిఏ అధికారులు వేతనాలు చెల్లించడంలో మాత్రం ఎందుకు జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. మూడు మాసాలుగా వేతనాలు లేకపోవడంతో తాము ఏమి తిని బతుకుతున్నామో కనీసం అధికారులకు తెలియదా అని ప్రశ్నించారు. బకాయి పడ్డ మూడు నెలల వేతనాలు ఈ నెలలో చెల్లించని పక్షంలో వచ్చే నెలలో చలో ఐటిడిఏకు సిహెచ్ డబ్ల్యులంతా కదం తొక్కుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దేవోరా, పావని, సత్యవతి, అప్పలమ్మ, కుమారి, కే.బాలమ్మ, లోవ కుమారి పాల్గొన్నారు.

వస్టబిన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మాధవరావు

డస్ట్‌బిన్లు పంపిణీ

ప్రజాశక్తి- పెదబయలు : సీతగుంట పంచాయతీ రోగుల పేట, కుమ్మరి పుట్టు గ్రామాలలో స్థానిక సర్పంచ్ పి.మాధవరావు ప్లాస్టిక్ డస్ట్ బీన్స్‌ను మహిళలకు బుధవారం పంపిణీ చేసారు. గ్రామాల్లో చెత్తా చెదారం ఎక్కడబడితే అక్కడ వేస్తే దోమలు అదికమయ్యే అవకాశం ఉందన్నారు. చెత్తను డస్ట్‌బిన్లలో వేసి తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ గంగాధరం, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు

ప్రజాశక్తి-పాడేరు: అర్హత కలిగిన రైతులందరికీ కిసాన్ క్రెడిట్ అందించాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి ఐటిడిఏ పి.ఒ.లు, జిల్లా వ్యవసాయాధికారులు, ఉద్యానవన అధికారులు, సెరీ కల్చర్, కాఫీ బోర్డు, స్పైసెస్ బోర్డు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో సాగు చేస్తున్న కాఫీ, ఉద్యానవన, జీడి, రబ్బరు తోటల పెంపకం, మిరియాల సాగులో రైతులు పొందుతున్న ఆదాయం, మార్కెటింగ్ సదుపాయాలు, గిట్టుబాటు ధరలపై సమీక్షించారు. రైతులకు గిట్టుబాటు ధరలు అందించడానికి అవసరమైన చర్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు బ్యాంకు లింకేజీ అందించాలని సూచించారు. రంప చోడవరం డివిజన్ పరిధిలో 34 వేల మంది రైతులు 64 వేల ఎకరాలలో జీడి తోటలు 3180 ఎకరాల్లో జాఫ్రా తోటలు పెంచుతున్నారని చెప్పారు. 3 వేల మంది రబ్బరు సాగు చేస్తున్నారన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతు ఉత్పత్తుల విక్రయాలకు డిజిటల్ తూనిక యంత్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

పాడేరు ఐటిడిఏ పిఒ అభిషేక్ మాట్లాడుతూ, 1.9 లక్షల ఎకరాల్లో కాఫీ సాగు చేస్తున్నారని, 75 వేల మెట్రిక్ టన్నుల కాఫీ పళ్ల దిగుబడులు వస్తున్నాయన్నారు. గత ఏడాది కాఫీ రైతులకు కాఫీ పళ్ళ కిలోకు రూ.43లు చెల్లించామని, దానికి అదనంగా మరో మూడు రూపాయలు బోనస్‌గా అందిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది రెండు వేల టన్నుల కాఫీ పళ్ల సేకరణ లక్ష్యంగా నిర్దేశించామని స్పష్టం చేసారు. నాణ్యమైన కాఫీ పళ్ళ సరఫరా చేసేలా లైజాన్ వర్కర్ల ద్వారా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. పామాయిల్ సాగుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా ఉద్యాన వన అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రంపచోడవరం పి.ఓ . కె.సింహాచలం, చింతూరు పి.ఓ అపూర్వ భరత్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్. బి.ఎస్. నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్ కుమార్‌రావు, కాఫీ బోర్డు డిడి రమేష్, స్పైసెస్ బోర్డు సీనియర్ క్షేత్ర అధికారి బి.కల్యాణి, జిసిసి డి. ఎం లు సింహాచలం, దేవరాజ్ పాల్గొన్నారు.

కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

నీటి సంఘాల ఎన్నికలకు కసరత్తు

- తాజాపర్చుతున్న ఓటర్ల జాబితా
- నాలుగు ప్రాజెక్టు కమిటీలు
- 303 సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నిక

తాండవ ప్రాజెక్టు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో 303 నీటి వినియోగదారుల సంఘాలకు ఓటర్ల జాబితా తయారుచేసే పనిలో రెవెన్యూ యంత్రాంగం ఉంది. సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయించడంతో వనరుల వారీగా ఓటర్లను గుర్తిస్తున్నారు. ఈ సంఘాలకు త్వరలో జరిగే ఎన్నికలకు ఆయకట్టుదారులు ఓటర్లు కానున్నారు. జిల్లాలోని 24 మండలాల్లో ఒక భారీ నీటిపారుదల ప్రాజెక్టు, మూడు మధ్య తరహా ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో రెండు లక్షలా 257 ఎకరాల ఆయకట్టు ఉంది. భారీ నీటిపారుదల జలాశయం తాండవకు ప్రాజెక్టు కమిటీతో పాటు మూడు డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. మధ్యతరహా ప్రాజెక్టులు రైవాడ, పెద్దేరు, కోణాంకు ఒక్కొక్క ప్రాజెక్టు కమిటీకి ఎన్నిక జరగనుంది. భారీ, మధ్యతరహా, చిన్న తరహా సాగునీటి వనరుల పరిధిలో మొత్తం 303 నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

2015లో జరిగిన సాగునీటి సంఘ ఎన్నికల ఓటర్ల జాబితాలో స్వల్పమార్పులు చోటుచేసుకొనే అవకాశముంది. ఓటర్ల జాబితాను తాజా పర్చడం కోసం సాగునీటి వనరుల పరిధిలోని ఆయకట్టుదారుల వివరాలను విఆర్‌ఒల నుంచి సేకరిస్తున్నారు. సాగునీటి సంఘాల వారీగా జరగనున్న ఎన్నికలకు వాటి పరిధిలోని ఆయకట్టుదారులను గుర్తించకల్గిన రెవెన్యూ యంత్రాంగానికి ఓటర్ల జాబితా తయారీ పని ప్రభుత్వం అప్పగించింది. ఎన్నికలు జరగాల్సిన పాత, కొత్త ఆయకట్టుదారుల వివరాలను విఆర్‌ఒలు సేకరిస్తున్నారు. నీటి వినియోగదారుల సంఘాల కిందవున్న విస్తీర్ణం, ఆయకట్టుదారుల సమాచారం క్రోడీకరించి తాజా పర్చనున్నారు. గత ఎన్నికల నాటికి ఓటరుగా ఉన్న ఆయకట్టుదారులు, తమ భూమిని ఇతరులకు అమ్ముకుంటే, వారి స్థానంలో కొత్త రైతును ఓటరుగా నమోదుచేయనున్నారు. మరణించిన వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించి, ప్రస్తుత ఆయకట్టుదారులను ఓటర్‌గా చేర్చనున్నారు. ఆయకట్టుదారులు తమ భూములకు నీటి తీరువా చెల్లింపును పరిశీలించనున్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు నీటిపారుదలశాఖాధికారులు సమాయత్తమవుతున్నారు. భవిష్యత్తులో కాలువల నిర్వహణ, పూడికలతీత, జలాశయాల మరమ్మతు పనులు ఎన్నికైన సంఘాలు చేపట్టనున్నాయి.

పోర్టు హాస్పిటల్‌ను ప్రయివేటుకివ్వొద్దు

11న నిరసన

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ను పిపిపి పద్ధతిలో ప్రయివేటుకు ఇచ్చే ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని, పోర్టు నిధులతో అభివృద్ధి చేసి ఉద్యోగులు, కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11వ తేదీన సాలిగ్రామపురంలోని పోర్టు హాస్పిటల్ ఎదుట నిరసన చేపట్టనున్నట్లు సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు. జగదాంబ సమీపంలోని సుందరయ్య ప్రసాదరావు భవనంలో బుధవారం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుబ్బారావు, వి.కృష్ణారావులతో కలిసి జగ్గునాయుడు మీడియాతో మాట్లాడారు. పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ 1984లో 150 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్ది ఉద్యోగులకు మెరుగైన వైద్యసేవలందించిందన్నారు. ఇప్పుడు దానిని 300 పడకల మల్టీ డిసిప్లినరీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడాన్ని సిపిఎం స్వాగతిస్తుందన్నారు. అయితే పిపిపి పేరుతో ప్రయివేట్ వ్యక్తులకు కట్టబెట్టడం సరికాదన్నారు. [illegible] రద్దుచేయాలని డిమాండ్ చేశారు. 300పడకల ఆసుపత్రి నిర్మించి కేవలం 80 పడకలు మాత్రమే ఉద్యోగులకు కేటాయిస్తామని చెప్పడాన్ని ఆయన తీవ్ర వ్యతిరేకించారు. పోర్టు ఆఫీసర్స్, ఉద్యోగులు, కార్మికులు, మాజీ ఉద్యోగుల కుటుంబాలు సుమారు 40 వేల మంది ఈ హాస్పిటల్‌లో వైద్యం పొందుతున్న సంగతిని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, పోర్టు యాజమాన్యం మర్చిపోరాదన్నారు.

విశాఖపట్నం పోర్టు ప్రభుత్వరంగ సంస్థలో ఉంటూ మంచి లాభాలార్జించిందన్నారు. క్రమేణా బెర్తులు ప్రయివేటీకరించడం, స్టేడియం, భూములన్నీ ప్రయివేటువారికి దారాదత్తం చేయడానికి పూనుకుంటున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.380 కోట్లు లాభాలతో నడిచిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.171 కోట్లు పన్నులు చెల్లించిందని గుర్తు చేశారు. కార్గో హ్యాండ్లింగ్‌లో దేశంలో రికార్డులు సాధించిందని తెలిపారు. ఈ లాభాలకు కారణం ఉద్యోగులు, కార్మికులు అన్నారు. సంస్థ లాభాలకోసం పనిచేస్తున్న కార్మికుల ఆరోగ్యాలను కాపాడాల్సిన యాజమాన్యం ప్రయివేట్ లాభాలు కోసం చూడటం సరైనది కాదని, తక్షణమే విశాఖపోర్టు నిధులతో హాస్పిటల్ నిర్మాణం చేపట్టి ఉద్యోగులకు, కార్మికులకు, రిటైర్డ్ ఉద్యోగులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. 11న పోర్టు హాస్పిటల్‌వద్ద చేపట్టే నిరసనలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని బుధవారం ఈస్ట్ కోస్ట్ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు రైల్వే డిఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జివిఎంసి 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు సమస్యలను డిఆర్‌ఎమ్‌కు వివరించారు. రైల్వే ఒబిహెచ్‌ఎస్ కార్మికుల పెండింగ్ 4 నెలల జీతాలను వెంటనే ఇవ్వాలని కోరారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో కాంట్రాక్టు కార్మికులకు జీతాలు అతి తక్కువగా ఇస్తున్నారని, లేబర్ యాక్ట్ ప్రకారం ఇవ్వటం లేదని తెలిపారు. రైల్వే స్టేషన్‌లో కార్మికులకు రోజుకు రూ.400 చొప్పున ఇస్తున్నారని, లేబర్ యాక్ట్ ప్రకారం అన్ స్కిల్డ్ కార్మికునికి రోజుకు రూ.655 ఇవ్వాలని చట్టం చెబుతుందని వివరించారు. ఈ చట్టాన్ని రైల్వే స్టేషన్‌లో కాంట్రాక్టర్లు అమలుచేయడం లేదని, తక్షణమే కార్మికుల జీతాలపై దృష్టి సారించి చట్ట ప్రకారం జీతాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైల్వే అన్ని డిపార్ట్‌మెంట్లలో ఎక్కడా కాంట్రాక్టర్లు లేబర్ యాక్ట్ ఫాలో అవ్వట్లేదు అని, అన్నిచోట్లా చట్ట ప్రకారం జీతాలు, ఐడెంటిటి కార్డులు, జీతం పే స్లిప్పులు, ఫైనల్ సెటిల్మెంట్, పిఎఫ్, ఈఎస్‌ఐ వంటి చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే రైల్వే కాంట్రాక్టర్లతో, యూనియన్ ప్రతినిధులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని డియర్‌ఎమ్‌ను కోరారు. దీనిపై డిఆర్‌ఎం స్పందిస్తూ యూనియన్ కోరినవిధంగా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు బి.జగన్, జనరల్ సెక్రెటరీ ఒ.అప్పారావు, ప్రెసిడెంట్ జి.శ్రీనివాసరావు, నాయకులు హరి తదితరులు పాల్గొన్నారు.

సిఎస్‌ఆర్ నిధులతో నిరాశ్రయుల షెల్టర్ల అభివృద్ధి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సిఎస్‌ఆర్ నిధులు రాబట్టి నగర పరిధిలో ఉన్న నిరాశ్రయుల షెల్టర్లలో సమస్యలు, ముఖ్యంగా మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. నిరాశ్రయుల షెల్టర్ల పరిశీలనలో భాగంగా బుధవారం టిఎస్‌ఆర్ కాంప్లెక్స్‌లోని ఎయుటిడి షెల్టర్‌ను ఆయన పరిశీలించారు.

విజయవాడ వరద బాధితులకు సాయం

సాయం చెక్కును అందజేస్తున్న సొసైటీ ప్రతినిధులు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విజయవాడ వరద బాధితులకు ఆంధ్రా యూనివర్సిటీ స్టాఫ్ కోఆపరేటివ్ సొసైటీ తమ వంతుగా రూ.రెండు లక్షల ఆర్థికసాయాన్ని అందజేసింది. ఈ మేరకు ఎయు రిజిస్ట్రార్ ఇఎన్.ధనుంజయరావుకు సొసైటీ ప్రతినిధులు ఆర్థికసాయం చెక్కును అందజేసి, ముఖ్యమంత్రి సహాయనిధికి పంపాలని కోరారు. సాయం చెక్కును అందజేసిన వారిలో సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్‌ఎం.యుగంధర్, సెక్రటరీ సిహెచ్.లక్ష్మణబాబు, ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ కె.కిరణ్‌కుమార్, డైరెక్టర్లు ప్రొఫెసర్ వి.సిద్ధయ్య, కె.సోమేశ్వరరావు, షేక్ ఖాదర్‌బాబా, డాక్టర్ జిఎల్‌ఎస్.రవికుమార్, ఎన్‌వి.గిరి, డి.గోవింద, మేనేజర్ ఆర్‌వి.రమణ పాల్గొన్నారు.

ఎపిఇపిడిసిఎల్ ఇఇగా గాబ్రియేల్

ఇఇ గాబ్రియేల్

ప్రజాశక్తి-రంపచోడవరం : ఎపిఇపిడిసిఎల్ నూతన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా టి.గాబ్రియేల్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఈయన గతంలో కాకినాడ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేశారు. ఉద్యోగోన్నతిపై రంపచోడవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా వచ్చారు. గతంలో ఇక్కడ పని చేసిన యమ్‌డి యూసఫ్ ఉద్యోగ విరమణ చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గాబ్రియేల్‌కు పలువురు సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

బోరు బావి డ్రిల్లింగ్ పనుల ప్రారంభం

డ్రిల్లింగ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి లక్ష్మి

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రామవరం గ్రామ పంచాయతీ పరిధి లక్ష్మీనగర్, చోపల్లి గ్రామాలలో తాగునీటి బోరు డ్రిల్లింగ్ పనులను ఎంపీపీ కారం లక్ష్మీ, స్థానిక సర్పంచ్ కారం బుచ్చమ్మ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లక్ష్మి మాట్లాడుతూ లక్ష్మీనగర్, చోపట్లి గ్రామాల్లో మంచినీటి సమస్య ఎక్కువగా ఉందని, సంవత్సరం కాలం నుండి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆయా గ్రామాల ప్రజల నీటి సమస్యను పరిష్కరించాలని ఉద్దేశంతో అధికారులతో మాట్లాడి చేతి పంపులు మంజూరు చేయించినట్లు చెప్పారు. మండలంలో ఏ గ్రామంలోనైనా మంచినీరు సమస్య ఉంటే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని ఎంపిపి కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పడ్లాది రమేష్, కారం సత్యం, లక్ష్మీనగర్ శాఖ కార్యదర్శి కుకునూరు నాగరాజు, జస్విని, ఆశ కళ్యాణ్, నారకొండ లక్ష్మి, వి.శంకరమ్మ, నారకొండ శేఖర్, నారకొండ భీమయ్య, ఆసు వెంకయ్య, ఉర్మ దాసయ్య, కారం వీరయ్య, ఉర్మా వెంకయ్య, కారం రమేష్, కారం నవీన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమెరికన్ కార్నర్‌ను బలోపేతం చేస్తాం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో నెలకొల్పిన అమెరికన్ కార్నర్ సహాయంతో అమెరికాలో విశ్వవిద్యాలయాలు, విద్య విధానం, స్కాలర్‌షిప్‌లు, వీసా పొందే విధానం తదితర అంశాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించాలని ఎయు విసి ఆచార్య జి.శశిభూషణ రావు అన్నారు. బుధవారం అమెరికన్ ఎంబసీ నుంచి వచ్చిన పబ్లిక్ డిప్లమసీ ఆఫీసర్ ఎమీలియా, పబ్లిక్ ఎంగేజ్‌మెంట్ స్పెషలిస్ట్ సెంథిల్ కుమార్‌లతో కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విసి ఆచార్య శశిభూషణరావు మాట్లాడుతూ ఎయు గ్లోబల్ వర్సిటీగా నిలుస్తోందన్నారు. ఇక్కడ 64 దేశాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని వివరించారు. అమెరికన్ కార్నర్‌ను మరింతి బలోపేతం చేస్తామన్నారు.

ఎయు రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావు మాట్లాడుతూ అమెరికన్ కార్నర్‌ను యువతకు మరింత చేరువ చేసే విధంగా పూర్తిస్థాయిలో కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. వర్సిటీలోని విభిన్న విభాగాలను భాగస్వామ్యం చేస్తూ కార్యక్రమాలను చేపడతామన్నారు. డ్యూయల్ డిగ్రీ కోర్సుల నిర్వహణ దిశగా సైతం తమకు ఆలోచన ఉందన్నారు.

అమెరికా ఎంబసీ అధికారులు ఎమీలియా, సెంథిల్ కుమార్ మాట్లాడుతూ భారత్-అమెరికా సంబంధాలు, పర్యావరణ అంశాలు, రెండు దేశాలకు సంబంధించిన అంశాలపై కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. అమెరికన్ కార్నర్ నుంచి అన్ని కార్యక్రమాలు ఉచితంగానే తాము నిర్వహిస్తామన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం, అమెరికన్ కాన్సులేట్‌ల అనుబంధాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. అమెరికన్ దౌత్యవేత్తలతో ప్రత్యేక ప్రసంగాలు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం వర్సిటీ తరపున ఎమీలియా, సెంథిల్ కుమార్‌లను సత్కరించి జ్ఞాపికను బహూకరించారు.

అమెరికన్ ఎంబసీ ప్రతినిధులను సత్కరిస్తున్న ఎయు విసి

విశాఖ స్టీల్ ఉత్పత్తులతో నిర్మాణ వ్యయం అదుపు

గీతం సదస్సులో ఆర్‌ఐఎన్‌ఎల్ నిపుణుల వెల్లడి



స్టీల్‌ప్లాంట్ నిపుణులను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : శ్రేష్టత, నాణ్యత ప్రమాణాలకు పేరెన్నికగన్న విశాఖ స్టీల్‌ప్లాంట్ (ఆర్‌ఐఎన్‌ఎల్) ఉత్పత్తులను నిర్మాణ రంగంలో వాడితే, అనవసర వ్యయాన్ని తగ్గించడానికి ఆస్కారం ఉంటుందని ఆర్‌ఐఎన్‌ఎల్, విశాఖ స్టీల్ ప్లాంట్ నిపుణులు వెల్లడించారు. బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం టెక్నాలజి ఎనేబులింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆర్‌ఐఎన్‌ఎల్ మార్కెటింగ్ అధికారులు అజయ్‌సేన్, ఎ.కె.రామారావు, ద్వారం స్వామి పాల్గొని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని వివిధ విభాగాలలో పాటిస్తున్న ఉన్నత ప్రమాణాలను విద్యార్థులకు వివరించారు. విశాఖ స్టీల్ ఉత్పత్తుల నాణ్యతను వివరించారు. నూరు శాతం శ్రేష్టమైన ముడి పదార్ధాలను ఉపయోగించడం ద్వారా విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో తయారైన ఉత్పత్తులు అంతర్జాతీయ ప్రమాణాలను అందుకుంటున్నామని వెల్లడించారు. ఆర్‌ఐఎన్‌ఎల్‌లోని రోలింగ్ మిల్లులు, ఆటోమేటెడ్ పైలింగ్, స్ట్రాపింగ్ విభాగాలు ఇతర సాంకేతిక వ్యవస్థలు ఉత్తమమైన స్టీల్ ఉత్పత్తులను ప్రపంచానికి అందించడానికి దోహద పడుతున్నాయని వివరించారు. ఈ సందర్భంగా వారు విశాఖ స్టీల్ ప్లాంట్ మార్కెటింగ్ వ్యూహాలను, డీలర్ల నియామకం, ఇ-సువిధ, ఇ-ఆక్షన్, గ్రామీణ ప్రాంతాలలో డీలర్ల ఎంపిక, ఎగుమతి నిబంధనలను విద్యార్థులకు వివరించారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజి డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ తెలుగు వారు గర్వించతగ్గ ప్రపంచ ప్రఖ్యాత ఉక్కు పరిశ్రమ అన్నారు. స్టీల్ ప్లాంట్‌లోని వివిధ విభాగాలలో ఉపయోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగ్ విధానాలు ఇంజనీరింగ్ విద్యను అభ్యసించే వారికి ఎంబిఎ వంటి కోర్సులు చదివేవారికి మార్గదర్శకంగా ఉపయోగపడతాయన్నారు. పరిశ్రమలతో విద్యాసంస్థలకు అనుబంధం ఏర్పడటం వల్ల వృత్తి విద్యను అభ్యసించే యువతలో నైపుణ్యం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో గీతంలోని ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, ఆర్కిటెక్చర్ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-గాజువాక: వాలంటీర్లకు ఉద్యోగభద్రత కల్పనతోపాటు పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరుతూ, బుధవారం కొత్త గాజువాక నుంచి జివిఎంసి గాజువాక జోనల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వాలంటీర్లు సంఘం ప్రధానకార్యదర్శి దీప్తి మాట్లాడుతూ ఐదేళ్లకుపైగా వాలంటీర్లుగా ప్రజలకు మెరుగైన సేవలను అందించామని, ముఖ్యంగా కరోనా సమయంలో కూడా ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజలకు సేవ చేశామన్నారు. ప్రభుత్వం మారిన వెంటనే తమను నిర్లక్ష్యం చేయడం సరికాదని, తమను కొనసాగించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కమిటీ నాయకులు ఎం.రాంబాబు మాట్లాడుతూ వాలంటీర్ల వ్యవస్థను కొనసాగించడంతోపాటు నెలసరి రూ.పదివేలు వేతనం చెల్లిస్తామనిఎన్నికలకు ముందు విపక్ష నేతలుగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ మాటిచ్చారని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. త్రిశంకుస్వర్గంలో ఉన్నవాలంటీర్ల కొనసాగింపు, వారి సమస్య పరిష్కారంపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎల్ బంగారం నాయుడు, గొలగాని అప్పారావు పాల్గొన్నారు.

దువ్వాడ మీదుగా

శ్రీకాకుళం, విజయవాడ మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : దసరా పండుగ సీజన్లో ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి, రైల్వే విజయవాడ, శ్రీకాకుళం రోడ్, విజయవాడ మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. 07215 విజయవాడ-శ్రీకాకుళం రోడ్ ప్రత్యేక రైలు ఈనెల 9, 10, 11, 12, 14, 15, 16, 17 తేదీల్లో రాత్రి 8గంటలకు విజయవాడలో బయలుదేరి మరుసటి రోజు అర్ధరాత్రి 1.28 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది, అక్కడి నుంచి 1.30 గంటలకు బయలుదేరి, తెల్లవారుజామున 5:30 గంటలకు శ్రీకాకుళం రోడ్డుకు చేరుకుంటుంది. 07216 శ్రీకాకుళం రోడ్ - విజయవాడ స్పెషల్ ఎక్స్ప్రెస్ రైలు ఈనెల 10, 11, 12, 13, 15, 16, 17, 18 తేదీల్లో ఉదయం 6.30 గంటలకు శ్రీకాకుళం రోడ్డులో బయలుదేరి ఉదయం 9:30 గంటలకు దువ్వాడ చేరుకొని, మరల 09:32 గంటలకు బయలుదేరి సాయంత్రం 4 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు విజయవాడ, శ్రీకాకుళం రోడ్ స్టేషన్ల మధ్య ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, ద్వారపూడి, అనపర్తి, సామర్లకోట, అన్నవరం, తుని, ఎలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు స్టేషన్లలో ఆగుతాయి.

పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణ ఆపే వరకు పోరాటం

ప్రజాశక్తి- సీతమ్మధార : పోర్ట్ హాస్పిటల్ ప్రైవేటీకరణ ఆపే వరకు తమ పోరాటం కొనసాగుతుందని యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ స్పష్టం చేశారు. బుధవారం పోర్టు ఆసుపత్రి వద్ద యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎనిమిదో రోజు రిలే నిరాహారదీక్షలను ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, కార్మికుల కష్టంతో విశాఖ పోర్టుకు రూ.వేల కోట్లలో లాభాలు వస్తున్నాయన్నారు. ఈ ఏడాది పోర్టుకు రూ.786 కోట్లు లాభంరాగా అందులో రూ.171.42 కోట్లు ప్రభుత్వానికి పన్నులు రూపేణా కట్టామన్నారు. ఉద్యోగులు, కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పోర్టుకు వచ్చిన లాభాలతో ఆసుపత్రిని నిర్మించారని, ఇపుడు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌గా రూపుదిద్దుకున్న క్రమంలో ఈ ఆసుపత్రిని పిపిపి విధానంలో అభివృద్ధి చేసేందుకు ప్రయివేటుకు కట్టబెట్టాలని కేంద్ర ప్రభుత్వం చూడడం దుర్మార్గమన్నారు. ఆసుపత్రి నిర్వహణకు రాబోయే వందేళ్లకు సరిపడేంతగా రిజర్వ్ ఫండ్స్ పోర్ట్ వద్ద ఉన్న నేపథ్యంలో దీన్ని ప్రయివేటుకు కట్టబెట్టి పోర్టు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబాలకు నాణ్యమైన వైద్యాన్ని దూరం చేయాలన్న కేంద్రం ఆలోచన దుర్మార్గమన్నారు. గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రిని పోర్టు నిర్వహించలేని పరిస్థితుల్లో ఉంటే,కార్మికులకు అప్పగిస్తే, తామే అభివృద్ధి చేసి నిర్వహించుకుంటామని, దీనికి ఇప్పటికే జిల్లాలోని కార్మిక, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతునిస్తూ సన్నద్ధంగా ఉన్నాయన్నారు. పోర్టు ఆసుపత్రిని ప్రయివేటుపరం కాకుండా ఉద్యమాన్ని ప్రజాపోరాటంగా ఉధృతం చేసి, తామే రక్షించుకుంటామన్నారు. దీక్షలో యూనియన్ నేతలు నాయుడు శంకరరావు, గణేష్,నర్సింగరావు,విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులు

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరు దారకొండ దుర్గాదేవి అమ్మవారు బుధవారం సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మూడు సంవత్సరాల వయసు గల చిన్నారులకు దుర్గాదేవి సన్నిధిలో సామూహిక అక్షరాభ్యాసం చేశారు. ముందుగా అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు. కార్యక్రమంలో గొర్రెలు గణేశ్వరరావు, కొర్ర రాము, గోరగాలి లక్ష్మమ్మ, కమిటీ సభ్యులు సురేష్, ఉమామహేశ్వరి, వరలక్ష్మి, మీనా, సుధా, రవణమ్మ పాల్గొన్నారు.